
కథ

# ఒక త్రిశంకుడి కథ

జి.ఎస్.రామ్మోహన్



**ఇప్పుడేంది ఎంగటసామి ఇది! ఎవరు కనిపించినా ఇదే మాట. విసిగిపోయాడు వెంకటస్వామి. ఒక పదం అటూ ఇటూ కావచ్చుగాని అందరిదీ ఇదే ఆశ్చర్యం.**

ఏమిటిది అనేదానిమీద ఎవరికీ ప్రశ్నల్లేవు. ఇపుడా అనేదే ఆశ్చర్యమంతాను. మూలిగే నక్కమీద తాటికాయలాగా వెంకటస్వామిని మరింత గుచ్చుతుంది కూడా సరిగ్గా అదే. మామూలుగా అయితే వాళ్ల ఆశ్చర్యం గురించి అంత ఆలోచన లేకపోవును. కానీ ఆ ఆశ్చర్యం వాళ్లది మాత్రమేనా అనేది ప్రశ్న. జీవితపు చివరి అంకంలో ఎందుకీ చింత. సమాధానాల్లేని ప్రశ్నలుండవని, పరిష్కారాల్లేని సమస్యలుండవని చాలామంది పెద్దలంటూ ఉంటారు కానీ అన్నంత సులభం కాదేమో! వెంకటస్వామి ఆలోచనలు అంతూ పొంతూ లేకుండా సాగుతున్నాయి. అసలు చింతకంటే కూడా చింత వెనకాల వున్న కారణాన్ని కనుక్కోవడంలోనే బహుశా అలిసిపోయాడేమో! రిటైర్‌మెంట్‌కు సరిగ్గా రెండు నెలలుండగా ఈ ఆలోచన రావడం తనకే చిత్రంగా తోస్తోంది, ఒక్కోసారి తీవ్రంగా ఆలోచిస్తే. ఒక్కోసారేంటి! అసలు నెలరోజులుగా తాను ఆలోచించకుండా ఉన్నదెపుడని! కూతురు పెళ్లి గురించేనా చింత. మరీ పెళ్లి చేయలేనంత పేదరికంలో ఏమీ లేడుగా! అబ్బ, జేజబ్బ పుణ్యమాని తిరుపతిలో పడి ఉన్న భూములు ఇపుడు ప్లాట్ల రూపంలో ఆపద్బాంధవుల్లా మారాయి కదా! కట్నకానుకలు, పెళ్లి ఎలాగో లాగించేయొచ్చు. పి.ఎఫ్., గ్రాట్యుటీలతో ఒక గూడు వేసుకోవచ్చు కూడాను. మరెందుకు? ఎందుకు? బహుశా జీవితంలో ఇంతవరకూ లేని కంపేరిజన్ తొలిసారి జీవితంలో ప్రవేశించిందా? 30 యేళ్లుగా ఇరుగుపొరుగుల విలాసవంతమైన జీవితాలను చూపి తనలో మార్పు తేవడానికి రాజీలేని పోరాటం చేస్తున్న తన భార్య విజయం సాధించిందా! ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గా ఉండి సొంత ఇల్లు కూడా కట్టుకోలేని తన చేతగాని తనాన్ని బంధువులు చేస్తున్న ఎగతాళి పనిచేసిందా! నిజంగా తాను కూడా దాన్ని చేతగాని తనమనే అనుకుంటున్నాడా! తనంత బలహీనుడయ్యాడా! నిన్నటి తన బలం ఇవాళ బలహీనత గానూ. నిన్నటి తన నిజాయితీ ఇవాళ చేతగాని తనంగానూ తనకే అనిపిస్తున్నదా! తన విశ్వాసాలపై విశ్వాసం నశించిందా! కూతురు పెళ్లి ఖర్చులు, కొడుకు ఇంజనీరింగ్ ఫీజులు తన విశ్వాసాన్ని కబలించాయా? భార్యాబిడ్డలు, బంధుమిత్రులు తనకీ వైరస్‌ను ఎక్కించడంలో విజయం సాధించారా? పల్లెటూళ్లో రెండు గేదెలు పెట్టుకుని కాసింత పొలం పెట్టుకుని ప్రశాంతంగా బతకాలన్న నిన్నటి కల ఇవాళ ఆచరణ సాధ్యం అనిపించకపోవడమే కారణమా! రిటైర్‌మెంట్ అనేది మృత్యువులా బెదిరిస్తూ తన విశ్వాసాన్ని లాగేసుకుందా! అసలు విశ్వాసం అని గంభీరంగా అనుకుంటాం గాని తనకెపుడైనా విశ్వాసాలు ఉన్నాయా! తన మానాన తాను ఉండడమే కాని ఎప్పుడైనా పైవాళ్లను గాని కింది వాళ్లను గాని ఎదిరించి నిలబడ్డాడా! ఎక్కడో ఏదో ఉంది. అదేంటో తెలీటం లేదు. ఏమో అనుకుంటాం కానీ జవాబుల్లేని ప్రశ్న వేధించి నంతగా మనిషిని వేధించేది మరేదీ ఉండదేమో!

ఇంటికొచ్చినోళ్లంతా రోగిష్టిని చూడడానికి వచ్చినట్టు రావడం అర్థమవుతూనే ఉంది. భార్యతో గుసగుసగా మాట్లాడడం అర్థమవుతూనే ఉంది. తనకు సానుకూల వచనాలు చెప్పడంలోని అంతరార్థమూ తెలుస్తూనే ఉంది. ఒక తిరప్తి నాయుడు వస్తాడు. "కొంచెం ఎవహారగ్యానం గూడ ఉండాలప్పా ఎంగటసోమా, నీ సుట్టుపక్కలోళ్లను జూసన్నా నేర్చుకోవాల", ...కొంచెం పెద్దరికం మీదేసుకుని అంటాడు. నీ అమెరికా అల్లుడు కూతుర్ని తన్ని తగలేసి నీది నీకు తినిపిస్తే ఏం పీకినావు వాయ్! అని తను అరుస్తాడు. కాదు, అరిచాననుకుంటాడు. మాటలు గొంతులోనే ఆగిపోతాయి. అడ్డుపడుతున్న వెలక్కాయ ఏమిటో అర్థంకాదు. ఎందుకో తెలీదు గాని అప్పుడు "నీ జాతి లక్షణమ్ము, నీ కోతి లక్షణమ్ము" అని శ్రీరామాంజనేయ యుద్ధంలో పద్యాన్ని గొణుక్కుంటాడు. ఒక్కో సారి గట్టిగానే పాడతాడు- వాళ్లు వెళ్లిపోయాక. భార్య మొకంలో భయం చూశాక వాల్యూమ్ మరింత పెంచుతాడు కసితీరా. ఎవరి మీద కసి? ఎవరి మీద తీర్చుకుంటున్నాడు? తెలీదు. అయినా ఎవరి మీద కసి వాళ్లమీదే తీర్చుకునే వెసులుబాటే ఉంటే ఇంతమందికి ఇన్ని మాయరోగాలు ఎందుకుంటాయి? అపుడేం జరుగుతుంది? భార్య తన చెల్లెలికి ఫోన్ చేసి గంటసేపు మాట్లాడుతుంది దిగులు దిగులుగా. వాళ్లందరి దృష్టిలో తనదొక అర్థంకాని వ్యాధి. బహుశా తనకు కూడా!

ఇంతకీ తన జీవితంలో లంచం తీసుకోకూడదని ఎందుకనుకున్నాడు? అంత బలమైన కారణమేదీ కనిపించడం లేదు. ఏదో ఒక

రెండు పుస్తకాలు చదివినా తానెప్పుడూ కమ్యూనిస్టు కాదు. గాంధీ అంటే ఇష్టమే కానీ మరీ గాంధియన్ అనేంత వ్యవహారమైతే లేదు. విశ్వనాథనో, సంపత్కుమారాచార్యనో చదివినా తానెప్పుడూ ఆర్‌ఎస్సెస్ బాపతూ కాదు. లంచం తీసుకోకుండా ఉండడానికి భావజాల పరమైన కారణమేదీ లేదు. మరెందు కున్నాడు? "ఒరే చిన్నోడా! మనం ఒగరికి అన్యాయం చెయ్యకుండా బతకాల. అదే టైంలో నువ్వు అన్యాయం గాకుండా చూసుకోవాల. ఒగరికి అన్యాయం చేసేవోడు ఎప్పుడో అన్యాయం అయిపోతడు... తండ్రి మాటలు తనకు తెలీకుండానే పనిచేసి ఉంటాయా! "ఎందుకొచ్చిన మానసిక సంఘర్షణ. జీతం బాగానే వస్తుంది. జీవితం సుఖంగానే గడిచిపోతుంది. ఇంకెందుకు అనవసరంగా మనసుతో గొడవ పెట్టుకోవడం" ...ఉద్యోగంలో చేరిన కొత్తలో తిష్ఠవేసుకున్న ఆలోచనలు అంత బలంగా ఇంతకాలం సాగి ఉంటాయా! అంత బలమైన కారణం ఏదీ లేకుండానే ఊర్కే అలా అన్ని ఆకర్షణలను ఎదిరించి నిలబడగలిగాడా! తన బంధువులు తమలో తాము అనుకుంటున్నట్టుగా, అప్పుడప్పుడైనా తన భార్య తనలో తాను అనుకుంటున్నట్టుగా నిజంగానే తన చేతగానితనం కారణమా! చేతగానితనమే అనుకుంటే దానికి కారణమేమిటి? చట్ట భయమా? అదసలు ప్రశ్నే కాదుగా. వద్దన్నా పర్సంటేజిల ప్రకారం వచ్చిపడతాయిగా! ఎవర్నీ పీడించకుండానే! ఎవరికీ కష్టం కలిగించాల్సిన అవసరం లేకుండానే! ప్రతి ఆఫీసులోనూ ఉన్నదేగా! పైగా ఎవర్నీ పీల్చి పిప్పి చేయకుండా వచ్చినదానితో సంతృప్తిపడే వారిని ధర్మరాజని ఆఫీసుకొచ్చేవారూ, ఆఫీసును పర్యవేక్షించేవారూ గౌరవిస్తారు కూడాను. మరెందుకు ఆ ధర్మరాజు పదవిని వద్దనుకున్నట్టు! ఇప్పటిదాకా అలా ఎందుకున్నట్టు? ఇపుడు కొత్తగా ఎందుకు మథనపడుతున్నట్టు? రెంటికీ సమాధానాలు తెలీకపోవడం చిత్రంగా లేదూ!

"నాకు చెప్పు ఎంగటసామా? అసలు నీ బాదేంది? ఏందీ మనోవేదన? మా చేతైంది ఏదో చేద్దుము కదా!"... ప్రతివాళ్లా ఒక చేపను ఏడుచేపలు చేసి సమస్యను పరిష్కరించే ఏసుక్రీస్తులే. మనకేమీ నష్టం లేకుండా కేవలం పెదాల సాయంతో మైలేజీ సంపాదించడం మీద జనాలకెంత మోజు! అవును, మనం కోల్పోవాల్సిందేమీ ఉండదు అని గ్యారంటీ ఉన్నచోట ప్రతివాళ్లూ రంతిదేవులే, డొక్కాసీతమ్మలే. డబ్బును అరటిపళ్లు, అరడజను సాను భూతి మాటలు... ఖతమ్! కొందరికి మైలేజీ కేవలం మైలేజీ మాత్రమేనా! ఆధిపత్యం చూపించాలనే తాపత్రయం లేదూ! తనతో సానుభూతి వచనాలు పలికేప్పుడు ఒక్కొక్కరి మొకంలో ఎంత ఆర్గాజమ్. పిచ్చివాడా! ఎవరెన్ని దారుల్లో పయనించినా చివరికి మా దారికి రాక తప్పదనే భావం వాళ్ల కళ్లల్లో కనిపించడం లేదూ! విజేత చూపులో పరాజితుని పట్ల కనిపించే పరిహాసం లేదూ! తిరుగుబాటు చేసిన వ్యక్తిని కబళించగలిగినపుడు వ్యవస్థ చేసే వికటాట్టహాసం వినిపించడం లేదూ! నేలమీద నిలబడి బండి చక్రాన్ని ఎత్తిపట్టడానికి ప్రయత్నిస్తున్న కర్ణున్ని చూస్తున్నప్పుడు అర్జునుడి కళ్లలో కనిపించే క్రూరమైన కసి ప్రతిఫలించడం లేదూ వాళ్ల చూపుల్లో. అవును. ఎవ్విరీ డాగ్ హాజ్ ఇట్స్ ఓన్ డే.

"చూడు స్వామి! ఇందులో అనైతికం, అన్యాయం ఏమీలేదు. మాఫియా లీడర్ రామదాసు పేరువినే ఉంటావు గదా! ఎంతమంది రియల్ ఎస్టేట్ వాళ్లను వణికించాడు! బళ్లారిలో అరెస్ట్ చేశాం. వాడి దగ్గర 70లక్షలు దొరికాయి.దారిలో కాల్చి చంపాం. మూత్రానికని దిగి

**ఉద్యోగంలో చేరిన కొత్తలో తిష్ఠవేసుకున్న ఆలోచనలు అంత బలంగా ఇంతకాలం సాగి ఉంటాయా! అంత బలమైన కారణం ఏదీ లేకుండానే ఊర్కే అలా అన్ని ఆకర్షణలను ఎదిరించి నిలబడగలిగాడా! తన బంధువులు తమలో తాము అనుకుంటున్నట్టుగా, అప్పుడప్పుడైనా తన భార్య తనలో తాను అనుకుంటున్నట్టుగా నిజంగానే తన చేతగానితనం కారణమా! చేతగానితనమే అనుకుంటే దానికి కారణమేమిటి? చట్ట భయమా?**



పారిపోవడానికి ప్రయత్నిస్తే కాల్చాల్సి వచ్చిందని చెప్పాం. 10 లక్షలు రికవరీ చూపాం. 30 లక్షలు నా సబార్డినేట్స్‌కి, 30 లక్షలు నాకు. వాడి పీడ వదిలినందుకు రియల్ ఎస్టేట్ వాళ్లు కోటిరూపాయలిచ్చారు. అఫ్‌కోర్స్! ముందుగానే వాళ్లతో ఒప్పందం కుదిరిందనుకో. ఇందులో అన్యాయమేమైనా ఉందా! వాడొక రౌడీ. చంపినందుకు ఎవరికీ బాధ లేదు. అందరూ సంతోషించేవాళ్లే. సింపుల్‌గా కోటి ముప్పైలక్షలు వచ్చినట్టే కదా! ఇందులో ఎవరికి అన్యాయం చేసిందేముంది చెప్పు. ఇవే కాదు. బార్లవాళ్లు, ఆటోల యూనియన్‌ల వాళ్ల నెలానెలా ఇచ్చేవాటి సంగతే తీసుకో. ఇవింకా న్యాయమైనవే కదా! చుక్కనెత్తురు చిందకుండా ఎవర్నీ అదిలించకుండా బెదిలించకుండా న్యాయంగా సంపాదించిందే కదా! బార్లు 11కు మూసే బదులు 12కి మూస్తే జనానికేమైనా అన్యాయం జరిగిపోతుందా! డిపార్ట్‌మెంట్‌లో నాకున్న పేరే తీసుకో. ఎంత మంచిపేరుందో నీకు ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. నువ్వు మాత్రం ఎందుకిట్లా చాదస్తంగా ఉంటున్నావో నాకర్థం కావట్లేదు, పైగా నీ డిపార్ట్‌మెంట్‌లో ఊర్కే ఏ హడావిడి లేకుండా డబ్బొచ్చిపడుతుంది కదా! మా డిపార్ట్‌మెంటుకన్నా కాస్త మీడియా హడావిడి ఉంటుంది. అప్పుడప్పుడూ ఆ రిపోర్టర్లకు కూడా వాటా పంచాల్సి ఉంటుంది. మీకా బాధలు కూడా లేవు కదా!" ...ఏపిపిఎస్సిలో బ్యాచ్‌మేట్ ఎస్పి సదానందం అప్పట్లో చేసిన ఉపదేశం గుర్తొచ్చింది. రేపో మాపో అతను డిఐజి కాబోతున్నాడు. పోలీస్ శాఖ ప్రమాణాల ప్రకారం అతనికి మంచి ఆఫీసరనే పేరుంది. అతనొక్కడేనా! ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ ప్రతాపరెడ్డి, తూనికలు కొలతల శాఖ అడిషనల్ కమిషనర్ దివాకర్, సెక్రటేరియట్‌లో జాయింట్ సెక్రటరీ హనుమంతప్ప... ఎంతమంది ఎంతమందని ఎన్నిసార్లని తనతో మొత్తుకోలేదు. ఎన్నిరకాలుగా ఆదాయపు అవసరం గురించి చెప్ప లేదు. 'పీడించి తీసుకుంటే తప్పుకానీ అవతలివాడు ఇవ్వడానికి



## భోజనం

“డాక్టర్‌గారూ! ఎన్ని మందులు వేసుకున్నా దగ్గు తగ్గటంలేదు” అంటూ ఆగకుండా దగ్గుతూనే వున్నాడు సోమేష్.

అతన్ని పరీక్షించిన డాక్టర్ “నీ లంగ్స్ పాడైపోయాయి. రోజుకు ఎన్ని సిగరెట్లు కాలుస్తావు” అని అడిగాడు.

“దాదాపు పదిహేను కాలుస్తాను”

“అయితే ఇప్పటి నుంచి భోజనం చేసిన వెంటనే ఒకటి కాల్చు. అంతకంటే ఎక్కువ కాలిస్తే నీ దగ్గు తగ్గదు”

నెల రోజులు తర్వాత కలిసాడు డాక్టర్‌ను.

“ఎలా వుందయ్యా నీ దగ్గు” అడిగాడు డాక్టర్.

“దగ్గు తగ్గలేదండి. దానిమాట ఎలా వున్నా, రోజుకు పదిహేను సార్లు భోజనం చేయలేక చచ్చిపోతున్నాను డాక్టర్” అన్నాడు సోమేష్ పొట్ట చేత్తో పట్టుకుని.

సిద్ధంగా ఉన్నప్పుడు తీసుకోవడంలో తప్పేంటనే' వాళ్లు కొంతమంది, 'పోనీ చేయకూడని పనిచేయడానికి తీసుకోవద్దు, మనం చేయాల్సిన పని చేయడానికి కూడా చాలామంది డబ్బులిస్తారు కదా, ఎలాగూ చేసే పనే- తీసుకుంటే తప్పేంటని' లాజిక్ వివరించేవాళ్లు కొంత మంది, 'రేపు నీ కూతురు పెళ్లి ఊరికే అవుతుందా, కొడుకు కాలేజీ చదువులు డొనేషన్లు కట్టకుండానే అవుతాయా' అని హెచ్చరించిన వాళ్లు... అబ్బో! చెప్పడానికి లేదు. అన్నట్టు “ఇప్పుడంటే ఇలాగే అంటావు. రేపు రిటైరయ్యాక, చేతిలో అధికారం పోయాక అప్పుడు తెలిసొస్తుంది” అని తీవ్రంగా ముందుచూపుతో హెచ్చరించినవాళ్లూ లేకపోలేదు. ఇక బంధువుల సంగతి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. “ఇదిగో ఈ మాదిరి మడికట్టుకుంటే ఈ రోజుల్లో కుదర్దు ఎంగటసామా!” అనేది తనదగ్గర మాట. అల్లుడు ఉత్త చాదస్తుడనేది భార్య దగ్గర చెప్పేమాట. ఇంకొంచెం చనువున్న వాళ్లైతే “ఉత్త ఎర్రి బాగులోణ్ని కట్టుకున్నావ్. ఎట్టా సంసారాన్ని ఈదుకొస్తావో ఏమో!” ... ఇదీ వరస. ఇంతకుముందైతే తనకు సలహాలివ్వాలని వచ్చినవారు తన మొకం చూసి వాటిని లోలోపల దాచుకుని ఏవో ప్రాపంచిక వ్యవహారాలు గంభీరంగా మాట్లాడి వెళ్లిపోయేవారు. మరీ దగ్గరి స్నేహితులు అయితే తప్ప. రెండు నెలల్లో పరిస్థితి మారింది. మరీ ముఖ్యంగా కూతురు పెళ్లి యత్నాలు మొదలు పెట్టినప్పటినుంచి.

మగపెళ్లివాళ్లెట్లా ఉన్నారు? ఒకడు కొండచిలువ మొహం వేసుకుని వస్తాడు. శబ్దం రాకుండా మేకపిల్లను మింగేసి గుంభనంగా కనిపించే కొండచిలువ మొకం. ఇంకోడు ఎలుగుబంటి మొకమేసుకుని వస్తాడు. సందుదొరక్కానే ఎగిరి మీదదూకి ఉడుంపట్టులో బిగించే ఎలుగుబంటి మొకం. ఇంటి ముందుకు వచ్చేదాకా బాగానే ఉంటారు. తలుపు దగ్గరకు రాగానే మొకం మారిపోతుంది. మొకమూ మారిపోతుంది. ఇక పెళ్లికూతురు తండ్రిగా తన మొకం ఎలా ఉండాలని సామాజిక శాస్త్రం ఘోషిస్తుంది. ఎలుక మొకం, కలుగులోంచి మూతి బయట పెట్టి భయం భయంగా అటూ ఇటూ చూస్తుండే ఆ ఎలుక మొకం. కాకపోతే పిల్లి మొకం, కుక్క తల కనిపించగానే బెరుకు బెరుగ్గా మెత్త మెత్తగా మూలుగుతూ తుర్రుమంటుండే ఆ పిల్లిమొకం. తనకలవాటైన పాతమొకంతోనే పెళ్లివారి ముందు కూర్చున్నందుకు భార్య లక్ష్మీదేవి ఎన్నిసార్లు డొక్కలో కుమ్మి ఉంటుందో, మెత్తమెత్తగా. ఒకడే మనిషి కొడుకు పెళ్లిలో ఒక జంతువుగానూ కూతురు పెళ్లిలో ఇంకో జంతువు గానూ మారిపోవడం బలే బలే! ఎంత లంచగొండి కాదనుకున్నా ఇన్‌కంటాక్స్ ఆఫీసరన్నాక కనీసం 50 లక్షలన్నా ఇచ్చుకోకపోతారా అనుకుని వస్తారు, సింపుల్‌గా! తన గోడు పట్టించుకునే వారెవరైనా ఉన్నారా? మైహూనా అనే వాళ్లెవరైనా ఉన్నారా? కోయీ హై బచానేకా!

మొన్న వాడేమన్నాడు? తాను భుజాలు జారిపోయి కూర్చున్న వేళ నాలుగు వేళ్లకు నాలుగు ఉంగరాలను తడుముకుంటూ బ్యాంకు మేనేజర్ రామశర్మ గాడేమన్నాడు? “నువ్వు అంత పత్తిత్తుగా ఉన్నప్పుడు కొడుకులను కూతుళ్లను కూడా అట్నే పెంచాలోయ్!”... అంటాడు. ఎందుకనడు. “లోన్ల బిజినెస్”లో పండిపోయి బూరుగు పరుపులాగా తయారైన వాడికి ఏ బిజినెస్సూ తెలీకుండా ఎండిపోయిన యాపచెట్టులాగా ఉన్నవాడిని చూస్తే అనాలనే అనిపిస్తుంది. పిల్లలు 60'ల 70'ల జనరేషన్ కాదని 90'ల జనరేషన్ అని తెలీకనా వాడికి! తండ్రి కంటే సమాజం బలమైనదని తెలీకనా! అయినా వాడిననుకొని లాభమేమి? నలుగురితో పాటు నారాయణ అనన‌పుడు ఆ నలుగురికీ తనమీద కసిగా ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు.


తన నిస్సహాయతను ఎత్తిచూపినట్టుంటే కూతురు చూపు. తనను బోనులో నుంచోబెట్టినట్టే. తన చేతగానితనాన్ని ఎత్తిచూపుతున్నట్టే. ఇంతకుముందైతే ఆ చూపు కేవలం భార్యకు మాత్రమే ఉండేది. ఇపుడు ఇంజనీరింగ్ కొడుకు, పెళ్లికూతురవుతున్న కూతురు కూడా. ఉన్నట్టుండి వెంకటస్వామి డైరీ తీసుకుంటాడు. అందులో ఇలా రాసుకుంటాడు. “అడ్డాలనాడు బిడ్డలు మన మెడలు వంచి మీద సవారీ చేస్తే అబ్బురంగా అనిపిస్తుంది. కానీ అదే బిడ్డలు గడ్డాలనాడు కూడా మెడలు వంచి సవారీ మొదలుపెడితే దుర్భరంగా అనిపిస్తుంది. అప్పటికి తండ్రి అనబడే అల్పజీవి రెక్కలు విరిగిన జటాయువులా ఉంటాడు కదా! వెన్నెముక వంగిపోయి ఇంకే మాత్రం భారం భరించలేక పెలుసుగా ఉంటాడు కదా!” ఒక్కసారి వాళ్ల మొకాలు చూశాడా- మూడ్ కూసింత తాత్వికంగా మారిపోతుంది. పాపం! వాళ్ల మాత్రం ఏం చేస్తారు. వాళ్ల తనలాగా రైతుబిడ్డలు కాదు. ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ బిడ్డలు.



తన సబార్డినేట్ ఆఫీసర్ల కొడుకులు కాలేజీకి కార్లలో వస్తూ తాను మాత్రం బజాజ్ చేతక్ మీద వెళ్లాలంటే వాడికి ఇబ్బందిగానే ఉంటుంది. క్వార్టర్లలోని ఇతర అధికార్ల కూతుళ్ల డిజైనర్ డ్రస్సుల్లో పబ్‌లకు కార్లలో వెళుతుంటే గడప లోపలే పంజాబీ డ్రస్సులో మిడిల్ క్లాస్ కలల్తోనే సరిపెట్టుకోవాల్సిన కూతురికి తాను నేరస్తుడిగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. కాకపోతే ఎపుడైనా అవకాశం వచ్చినపుడు మాత్రం అందరిలో మా నాన్న అందరిలా లంచగొండి

తన నిస్సహాయతను ఎత్తిచూపినట్టుంటే కూతురు చూపు. తనను బోనులో నుంచోబెట్టినట్టే. తన చేతగానితనాన్ని ఎత్తిచూపుతున్నట్టే. ఇంతకుముందైతే ఆ చూపు కేవలం భార్యకు మాత్రమే ఉండేది. ఇపుడు ఇంజనీరింగ్ కొడుకు, పెళ్లికూతురవుతున్న కూతురు కూడా. ఉన్నట్టుండి వెంకటస్వామి డైరీ తీసుకుంటాడు. అందులో ఇలా రాసుకుంటాడు.

కాదు, నిజాయితీపరుడు అని పైపైకి చెప్పుకోవడానికి ఉపయోగపడతాడు. అపుడప్పుడు మాత్రమే. పైపైకి మాత్రమే. అదేమీ వారికి రియల్ ఆనందాన్ని ఇవ్వదని తనకు తెలుసు. ఊర్కే ఒక అపార నష్టాన్ని అనుభవించక తప్పనప్పుడు అందులో అవకాశమున్నంత మేరకు ఆధిపత్యాన్ని కూడా పొందుదామనే ఆశ తప్ప తాను లంచం తీసుకోకపోవడమనేది గొప్పగా కాక చేతగానితనంగానే వారు భావిస్తున్నారని తనకు బహుబాగా తెలుసు.




ఇక లక్ష్మి! తను మాత్రం ఏం జేస్తుంది? పొద్దస్తమానూ ఇంటిల్లిపాదికీ వండి వార్చి ఖైదీ బతుకు బతికే ఆడది కనీసం పెళ్లిళ్ల పేరంటాళ్లలోనైనా ఆఫీసర్ భార్యను అనిపించుకునే భోగం ఉండాలని కోరుకోవడం సహజం. తానా భోగాన్ని ఇవ్వలేకపోయినాడు. తన పెళ్లి అయిన కొత్తల్లో అమ్మాయిని ఊరికి దూరంగా ఇచ్చినారని లక్ష్మి బంధువులు ఎంత ఆడిపోసుకునేవారు! "పటమటకిచ్చినారు. ఇక్కడెవళ్లూ మొగాళ్లులేరని" ..."మంచీ చెబ్బర చూసుకోవాలంటే ఎంత దూరం!ఓ యాబై కిలోమీటర్లు! ఇవాళ అమెరికా అల్లుడికి తక్కువైతే ఊరుకోవట్లేదు. అదే మనుషులు! డబ్బు మనిషిని ఇంతగా మారుస్తుందా! మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలన్న ఆ గడ్డపోడి మాటలే కరెక్టా! అందరూ అవకాశవాదులేనా? అవును! పచ్చి అవకాశవాదులు!! ఆలుబిడ్డలు, బంధువులు, సోదరులు అందరూ అవకాశవాదులే. కానిదెవరు? ఈ భూమ్మీద ప్రతిజీవీ అవకాశవాదే. డబ్బులో ఆధిపత్యాన్ని వెతుక్కొనేవారు కొందరు. హోదాలో ఆధిపత్యాన్ని వెతుక్కునేవారు మరికొందరు. అందంలో వెతుక్కునే వారు ఇంకొందరు. కులంలోనో, మతంలోనో, జెండర్‌లోనో, ఇంకా చాలా చాలారకాలుగా ఆధిపత్యాన్ని వెతుక్కుని దాన్ని ఆనందించడమే మనిషి ప్రాథమిక లక్షణం. తాను మాత్రం! మంచితనాన్ని, నిజాయితీని ఆధిపత్యంగా ఉపయోగించుకోవాలనుకోలేదా! అందరూ తనను మంచివాడు, నీతిపరుడు అంటూ ఉంటే పొంగిపోలేదా? అందరూ తన నిజాయితీని చూసి భయపడుతుంటే చూసి ఆనందించలేదా? అది ఆధిపత్య ప్రదర్శన కిందికిరాదా! ఛ, ఛ, వారికీ తనకూ పోలికేంటి? ఆధిపత్య సాధనలోనూ నైతికమార్గం అవసరమైన మార్గం. అనుసరణీయ మార్గం... నెలరోజుల్నుంచీ ఇవే ఆలోచనలు. ఆది లేదు. అంతం అసలే లేదు. ఈ ఆలోచనలు ఎక్కడ పుట్టాయో తెలీదు. ఎలా ముగుస్తాయో అంతకన్నా తెలీదు. ఆఫీసుకు సెలవు పెట్టి యానిమల్ ప్లానెట్‌లో జింక కోసం మాటువేసే పులుల్ని చూసుకుంటూ అలా ఆలోచనల్లోనే పొద్దుపొచ్చుతున్న వెంకటస్వామిని చూసి భార్య లక్ష్మీదేవికి తొలిసారి నిజమైన భయం వేసింది. అది తన భర్త అందరిలాగా తనను సిరిసంపదల్లో ముంచి తేల్చబోవడం లేదని తెలిసిన కొత్తలో వేసిన భయంకన్నా నిజమైనది. 'మంచో చెడో 30 యేళ్ల కాపురం చేసింది. విలాసాలు లేవనే కాని ఎన్నడూ గట్టిగా ఒక మాటని ఎరుగడు, చేయెత్తి కొట్టిందైతే అసలే లేదు. ఒక్క ఆ చాదస్తం తప్ప మనిషిలో వంక పెట్టడానికే లేదు. కనీసం చేసిన వంట బాగా లేదని అన్న సందర్భాలు కూడా తక్కువే. ఇట్లా మనోవేదనలో మునిగితేలితే ఏమైపోతాడో ఏమో' అన్నంత ఆందోళన పట్టుకుంది. అందుకే తెలిసిన బంధువులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్ కందరికీ కబురుచేసింది మొగుడి మూడ్ మార్చమని. కానీ ఆయన తన ఆలోచనలు ఎవరితోనైనా పంచుకుంటేగా. ఎవరొచ్చి ఏం మాట్లాడినా మునిలాగా వినడమే తప్ప నోరు తెరిచి మాట్లాడితేగా.

మాట్లాడకపోవడానికి కూడా ప్రత్యేకించి కారణమేమీ లేదు. అందరిలోనూ తాను ప్రత్యేకమైనవాడు అనే భావన ఇన్నాళ్లూ తలపై తేజోవలయంలాగా ఆవరించి ఉండేది. వేర్ దేరీజ్ నో ఫియర్... అన్న ఠాగూర్ పద్యంలో మాదిరి తల ఎప్పుడూ హెల్డ్ హై అన్నట్టే ఉండేది. అదో తృప్తి. ఇవాళ కొత్తగా వచ్చిన ఆందోళనను తనలో తాను తేల్చుకోవాల్సిందేగాని వారందరితోనూ పంచుకొని, పలుచన కాలేడు. ఇన్నాళ్లూ వారిపై తాను మానసికంగా పొందుతున్న ఆధిపత్యాన్ని కోల్పోలేడు. సగర్వమైన తన చరిత్రను ఒక్కసారిగా కాలదన్నుకుని మందలో గొర్రెపిల్ల కాలేడు. అయినా తాను మందలో కలిసినట్టే భావించి వాళ్లు ఆనందాన్ని పొందుతారా, సానుభూతి వచనాలు చెపుతారా, చెప్పనివ్వండి. స్వయంతృప్తిని అడ్డుకునేదెవ్వరు? కానీ బట్టలు విప్పి వారి ముఖరతికి సహకరించేది మాత్రం లేదు.

"ఇపుడేమైంది. ఒక్కరోజులో కోటిరూపాయలు సంపాదించిన ఆఫీసర్లున్నారు. ఇంకా నెలరోజుల సర్వీసుంది. నువ్వు తల్చుకుంటే పెద్ద కష్టమేమీ కాదు" ... ఒక సన్నిహితుడి సుభాషితం. "ఇన్నాళ్లూ నిష్ఠగా ఉన్నందుకు ఎట్లన్నా సాయం చేయాలని సార్‌కు భారీ సన్మానం చేసి పర్సు ఇవ్వాలనుకుంటున్నారు. ఆఫీసర్లంతా తలా ఇంత వసూలు చేస్తున్నారు. సార్ అదన్నా తీసుకునేట్టు చూడండి" ...భార్య చెవిలో బంట్రోతు గొణుగుడు- తనకు వినపడే మాత్రం జాగ్రత్త తీసుకుంటూనే. పిచ్చివాడు. తనకింకా ఆ పర్సును తిరస్కరించేంత బలముందనుకుంటున్నాడా! రేపో ఎల్లుండో శాలువా కప్పించుకునే దశలో ఇప్పుడు ముసలి చిరుతలాగా జనారణ్యం మీద పడేంత తెగింపు లేదు. అట్లని ఈ పర్సును తిరస్కరించేంత తెగింపు మాత్రం ఇపుడుందా! ఆ డబ్బు ఎక్కడెక్కడ్నించి మొబలైజ్ చేస్తారో తనకు బాగా తెలుసు. అయినా అది లంచం కిందికైతే రాదు. ఆ మాత్రం రాజీపడక తప్పదేమో! రాజీనా!! ఛఛ...ఇది రాజీకాదు. సర్దుబాటు. అవును, చిన్న సర్దుబాటు మాత్రమే. ఏమైతేనేంలే అవ్వకాదు, ముసలమ్మ. ఒకే జారుడు బండా! రేపు నీ కొడుకు పెళ్లిలో నువ్వూ ఎలుంగొడ్డు మొకం తొడుక్కుంటావా! కొండచిలువ మొకం తొడుక్కుంటావా! ఎంతకీ జవాబు రాదేం! గట్టిగా నోనో అని మనసు అరవదేం! లేదులేదు. తాను మరీ అంత క్రూరుడు కాలేడు. నిజమేనా! నిన్న మొన్నటిదాకా తన బంధువులందరిలోనూ తనంటేనే పసిపిల్లలు ఎగురుకుంటూ వచ్చి మీద ఎక్కేవాళ్లు. ఇక ముందు కూడా పసిపిల్లలు తనతో అట్లాగే ఉంటారా! ఏమో! ... వెంకటస్వామి ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి.

•

"ఇన్నాళ్లూ నిష్ఠగా ఉన్నందుకు ఎట్లన్నా సాయం చేయాలని సార్‌కు భారీ సన్మానం చేసి పర్సు ఇవ్వాలనుకుంటున్నారు. ఆఫీసర్లంతా తలా ఇంత వసూలు చేస్తున్నారు. సార్ అదన్నా తీసుకునేట్టు చూడండి" ...భార్య చెవిలో బంట్రోతు గొణుగుడు- తనకు వినపడే మాత్రం జాగ్రత్త తీసుకుంటూ నే. పిచ్చివాడు. తనకింకా ఆ పర్సును తిరస్కరించేంత బలముందనుకుంటున్నాడా!